సాక్షి వికారాబాద్

గురువారం । 2 । మే । 2024



'శత'కొట్టారు

కొడంగల్ శివారులోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యార్థులు 'పది' ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. 8లో▸



అన్నారంలో పులి సంచారం

కొడంగల్ మండల పరిధిలోని అన్నారం గ్రామ శివారులో పులి సంచరిస్తోందనే వార్త కలకలం రేపుతోంది. 8లో▸



బీఆర్ఎస్‌కు షాక్

తాండూరు మండలం గోనూర్ ఎంపీటీసీ నర్సమ్మ, మాజీ సర్పంచ్ గోవింద్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. 9లో▸

న్యూస్‌రీల్

నూర్పిడి ధాన్యాన్నే తేవాలి

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్



కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఏఓ గోపాల్

బొంరాస్‌పేట: రైతులు నూర్పిడి చేసిన ధాన్యాన్నే కొనుగోలు కేంద్రాలకు తేవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ సూచించారు. బుధవారం మండలంలోని మెట్లకుంట కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లాలో ధాన్యం ఉత్పత్తి గ్రామాల్లో మెట్లకుంట గ్రామ ఒకటని అన్నారు. ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కొడంగల్ ఏడీఏ శంకర్ రాథోడ్, ఏఈఓ భార్గవి పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలోనే అభివృద్ధి

మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి



తుపాకుల తండాలో ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

కుల్కచర్ల: దేశ ప్రజలు ప్రధాని మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి అన్నారు. బుధవారం రాంనగర్ పంచాయతీ పరిధిలోని తుపాకుల తండా, గండిచెరువు, గాదె కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోదీ ఆధ్వర్యంలో దేశం ఎంతో పురోగతి సాధించిందని పేర్కొన్నారు. దేశం కోసం, ధర్మం కోసం ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. అవినీతి పరులు, అవకాశవాదులకు ఓటు వేస్తే స్కాంలు చేయడం తప్ప వారి వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. ఆస్తుల కోసం, కేసుల నుంచి బయటపడేందుకు పార్టీలు మారే నాయకులకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మైపాల్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా నాయకుడు చంద్రలింగం, మండల కార్యదర్శి మైపాల్, నాయకుడు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్ మేడే వేడుకల్లో కార్మికులు

ఘనంగా మేడే వేడుకలు

జిల్లా వ్యాప్తంగా మేడే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్మిక సంఘాల నాయకులు యూనియన్ జెండాలను ఆవిష్కరించారు. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ నాయకులు కార్మికులతో సమావేశమై హక్కులు, సమస్యలపై చర్చించారు. కార్మిక హక్కుల సాధనే లక్ష్యంగా పోరాటాలు చేస్తామని నినదించారు.



తాండూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల ర్యాలీ

ఎండ మంట.. ఓట్ల వేట

భానుడి భగభగలను లెక్కచేయకుండా ప్రజల వద్దకు అభ్యర్థులు, నేతలు

- సమావేశాలు, రోడ్‌షోలతో సందడి
- అభ్యర్థుల విజయమే లక్ష్యంగా అధినేతలు పర్యటించే అవకాశం
- మరింత వేడి పుట్టిస్తున్న రాజకీయాలు



ఇటీవల బషీరాబాద్ మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని తరఫున ప్రచారం చేస్తున్న రోహిత్‌రెడ్డి

తాండూరు: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. దీంతో బరిలో నిలిచే అభ్యర్థులు ఖరారయ్యారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు పక్షం రోజుల నుంచే చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. గెలుపే లక్ష్యంగా దేశ, రాష్ట్రస్థాయి నేతలను రంగంలోకి దింపాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ భారీ బహిరంగ సభలు, కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోలకు ముహూర్తం ఫిక్స్ చేసుకుంటున్నాయి. ఇప్పటికే అసెంబ్లీల వారీగా మొదటి విడత ఎన్నికల ప్రచారాన్ని ముగించాయి. ఓ వైపు ఎండలు దంచి కొడుతుండగా.. మరోవైపు ఎన్నికల ప్రచారాన్ని మరింత హోరెత్తించేందుకు ప్రధాన పార్టీలు సిద్ధమవుతున్నాయి.

'చేవెళ్ల'పై ప్రత్యేక దృష్టి

చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాలపై ప్రధాన పార్టీలు ప్రత్యేక దృష్టి పెట్టాయి. మెజార్టీ ఓట్లను రాబట్టుకునేందుకు కసరత్తు చేస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కావడంలో అందరి దృష్టి చేవెళ్ల లోక్‌సభ స్థానంపైనే ఉంది. కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం నాయకులు, కార్యకర్తలు శ్రమిస్తున్నారు. ఈసారి ఎలాగైనా గెలిచి తీరాలని బీజేపీ భావిస్తోంది. ఓటు బ్యాంకు చెదరకుండా బీఆర్ఎస్ గట్టి ప్రయత్నమే చేస్తోంది. బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి, బీఆర్ఎస్ తరఫున కాసాని జ్ఞానేశ్వర్ పోటీలో ఉన్నారు. బీజేపీ తరఫున జిల్లాలో ఈ నెల మొదటి ప్రధాని మోదీ ప్రచారానికి ఆ పార్టీ నాయకులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ప్రచారం కూడా చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ఈ నెల 3న సీఎం రేవంత్‌రెడ్డి తాండూరులో ఎన్నికల ప్రచారం చేస్తారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని గెలుపుకోసం మాజీ సీఎం కేసీఆర్ తాండూరుకు రానున్నట్లు సమాచారం.

ఎండను లెక్కచేయకుండా..

జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు ఆరెంజ్ జోన్‌లోకి వెళ్లాయి. ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. మరో రెండు డిగ్రీలు పెరిగితే రెడ్ జోన్‌లో వెళతాయి. ఇంతలా మండిపోతున్న ఎండల్లోనూ ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు ఏసీ రూముల్లో సేద తీరిన నేతలు ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నారు. కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోలు, సమావేశాలతో దూసుకుపోతున్నారు. మరోవైపు కుల, కార్మిక, యువజన సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాయి. అలాగే ప్రత్యర్థి పార్టీలు, అభ్యర్థులపై ఆరోపణలు చేస్తూ ముందుకు సాగుతున్నారు.

బీఆర్ఎస్‌కు కలిసొచ్చేనా?

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో లక్ష ఓట్ల ఆధిక్యం వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు జిల్లాలో బలంగా ఉన్న బీఆర్ఎస్.. అధికారం కోల్పోగానే నాయకులు, కార్యకర్తలు ఇతర పార్టీలకు క్యూ కట్టారు. దీంతో పార్టీ కొంత వరకు డీలా పడింది. ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా మాజీ ఎమ్మెల్యేలు ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలుపు వరిస్తుందా..? ఓట్లు చీల్చి మరో పార్టీ అభ్యర్థి గెలుపునకు కారణం అవుతుందా అనేది రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

భానుడి ఉగ్రరూపం

- జిల్లాలో రెడ్ అలర్ట్‌కు చేరువలో ఉష్ణోగ్రతలు
- రెండు రోజుల వ్యవధిలో వడదెబ్బకు గురై ఇద్దరి మృతి



తాండూరు: జిల్లా వ్యాప్తంగా భానుడు ఉగ్రరూపం దాల్చాడు. పగటి ఉష్ణోగ్రతలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరగడంతో జనాలు అల్లాడిపోతున్నారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు ఆరెంజ్ అలర్ట్‌లో ఉన్న ఉష్ణోగ్రతలు బుధవారం రెడ్ అలర్ట్ స్థాయికి చేరాయి. దీంతో రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు వడదెబ్బకు గురై మృత్యువాత పడ్డారు. బషీరాబాద్‌లోని టాకి తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు రాణి ఎన్నికల విధులకు హాజరై వడదెబ్బ తగిలి బుధవారం మృత్యువాత పడ్డారు. రెండు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు 40డిగ్రీల నుంచి 44.8 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. మే నెల ప్రారంభంలోనే జిల్లా అగ్ని గుండాన్ని తలపిస్తోంది. జనం ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. వృద్ధులు, చిన్నారులు శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు.

పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు ఆఖరు

అనంతగిరి: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపునకు గురువారంతో గడువు ముగుస్తుందని జిల్లా ఇంటర్ నోడల్ ఆఫీసర్ ఎన్.శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాయాలనుకునే విద్యార్థులు సంబంధిత కళాశాలలో ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు, ఇంప్రూమెంట్ రాసే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం అప్లై చేసుకునే విద్యార్థులు మే 2లోగా ఆన్‌లైన్, మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వానాకాలం సాగుకు కసరత్తు

- 5.97లక్షల ఎకరాల్లో సాగుకు ప్రణాళిక
- జొన్న, మొక్కజొన్న పంట విస్తీర్ణం పెరగొచ్చని అంచనా
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- రాయితీ విత్తనాలు ఇవ్వాలని రైతుల విజ్ఞప్తి



వికారాబాద్: వానాకాలం పంటల సాగుకు వ్యవసాయ శాఖ కసరత్తును ప్రారంభించింది. ఇందులో భాగంగా ఆ శాఖ క్షేత్రస్థాయి అధికారులు, అనుబంధ శాఖల అధికారులతో సంప్రదిస్తున్నారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి వివరిస్తున్నారు. గత వానాకాలంలో సాగు విస్తీర్ణం ఎంత..? అందులో ఏయే పంటలు ఏమేరకు సాగయ్యాయి. రానున్న సీజన్‌లో ఏయే పంటల విస్తీర్ణం పెంచాలి.. ఏయే పంటలు తగ్గించాలి.. రైతులకు ఎలాంటి అంశాలపై అవగాహన కల్పించాలి అనే విషయాలు చర్చించారు. డివిజన్లు, మండలాల వారీగా ఏ మేరకు ఎరువులు అవసరం.. అందుబాటులో ఉంచాల్సిన ఎరువులు తదితర అంశాలపై కసరత్తు చేస్తున్నారు. భూసార పరీక్షలు, విత్తన ఎంపిక, నాణ్యమైన విత్తనాల కొనుగోలు, ఎరువులు తదితర వివరాలను తెలియజేయాల్సిన రైతు చైతన్య యాత్రలు నిర్వహిస్తారా లేదా అనే దానిపై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదు. జిల్లాలో నకిలీ విత్తనాలు, పురుగు మందు తదితర అంశాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. అయితే కొంతమంది వ్యాపారులు బీటీ -3 పత్తి విత్తనాలు గుట్టుగా విక్రయించేందుకు తిరుగుతున్నట్లు సమాచారం. గతంలో ప్రభుత్వమే పలు రకాల విత్తనాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు రాయితీపై అందించేది. ఐదారు సంవత్సరాలుగా రాయితీ పరికరాలు అందడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా రాయితీ విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

5.97లక్షల ఎకరాల్లో సాగు అంచనాలు

జిల్లాలో రానున్న వానాకాలం సీజన్‌లో 5.97 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయవచ్చని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. గతేడాది పత్తి పంట 2.61లక్షల ఎకరాల్లో సాగు చేయగా.. ఈ సారి 2.63 లక్షల ఎకరాలకు చేరి స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. కందులు 1.50 లక్షల ఎకరాల్లో.. వరి 1.10లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 50,450 ఎకరాల్లో, పెసలు 13,000 ఎకరాల్లో, మినుములు 5,000 ఎకరాల్లో, జొన్నలు 2,500 ఎకరాల్లో సాగు చేయవచ్చని భావిస్తున్నారు. వరి, మొక్కజొన్న, జీలుగ, జనుము, సోయాబీన్, కందులు విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎరువులు, విత్తనాలు ఎంత మేర అవసరం అవుతాయనే దానిపై అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. డీఏపీ 17,719 మెట్రిక్ టన్నులు, యూరియా 32,329 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 19,877 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 3,658 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 1,854 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనా వేశారు.

విత్తనాల కొరత ఉండదు



వానాకాలం సాగుకు సంబంధించి విత్తనాలు, ఎరువుల కొరత ఉండదు. నకిలీ విత్తనాల విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలి. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తే విధిగా రసీదు పొందాలి. బీటీ – 3 గ్లైసిల్ పత్తి విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి. వాటి వాడకాన్ని ప్రభుత్వం నిషేధించింది. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– గోపాల్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి

ఈవీఎంలపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- పీఓ, ఏపీఓ, ఓపీఓలకు ఎన్నికల విధులపై శిక్షణ కార్యక్రమం



అనంతగిరి: ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: ఈవీఎంలపై ఎన్నికల అధికారులు, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీఓ, ఏపీఓ, ఓపీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ పొందిన సిబ్బంది సమర్థవంతంగా ఎన్నికల బాధ్యతలు చేట్టాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో పాటించాల్సిన నిబంధనలు, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌లను సీల్ చేయడం, మాక్ పోలింగ్‌పై అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణలో పీఓలు, ఏపీఓలు, ఓపీఓలే కీలకమన్నారు. పోలింగ్‌పై ఎలాంటి సందేహాలు ఉన్నా మాస్టర్ ట్రైనర్లతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. మాక్ పోలింగ్‌ను సమర్థవంతంగా పూర్తి చేసిన తర్వాతే పోలింగ్ ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. 250 మంది ఉద్యోగులకు గాను 231 మంది శిక్షణ తరగతులకు హాజరయ్యారు. శిక్షణకు డుమ్మా కొట్టిన 19 మంది ఉద్యోగులకు మెమోలు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, ఎన్నికల సిబ్బంది, మాస్టర్ ట్రైనర్స్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు మరిన్ని ఈవీఎంలు

జిల్లాకు అదనంగా కేటాయించిన ఈవీఎంల మొదటి విడత పరిశీలన బుధవారం పూర్తయ్యింది. వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ సాగింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు అదనంగా ఈవీఎంలు వచ్చినట్లు తెలిపారు. రెండు రోజుల్లో మరో విడత పరిశీలనను పూర్తి చేస్తామన్నారు. ఓటింగ్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధీర్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం కండి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. బుధవారం బ్యాలెట్ పేపర్ల ముద్రణ, హోం ఓటింగ్, ఓటరు స్లిప్పుల పంపిణీ తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు తుది జాబితాకు అనుబంధ జాబితాను కూడా విడుదల చేసినట్లు తెలిపారు. ఓటరు స్లిప్పుల పంపిణీ కొనసాగుతున్నట్లు చెప్పారు. మే 3నుంచి హోమ్ ఓటింగ్ ప్రక్రియను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 1950, సీ – విజిల్‌కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఈడీఎం మహమ్మద్ పాల్గొన్నారు.

కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తాం: అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ

ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తూ, పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నట్లు వికారాబాద్ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూస్తామన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికలకు సహకరించాలని కోరారు. ఓటర్లు అధిక సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొనేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి వసతి, మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఎం నాయకులు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ అనిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

పారదర్శకంగా పని చేయండి

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్: ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు పారదర్శకంగా పని చేయాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీఓలు, ఏపీఓలకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎంపీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో ఈ ప్రాంత ఉద్యోగులు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఎన్నికలు సజావుగా ప్రశాంతంగా జరగడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఎన్నికల సంఘం ప్రతి అంశాన్ని పరిశీలిస్తుందన్నారు. పరిశీలకులు ప్రతినిత్యం గమనిస్తున్నారని తెలిపారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా పోలింగ్ బూతుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఎలక్షన్ డీటీ సురేష్, ఎంఈఓ రాంరెడ్డి, ఏఓ మహేశ్‌గౌడ్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

6న మైనార్టీల సమావేశం

ధారూరు: ఈనెల 6న జిల్లా మైనార్టీల సమావేశం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయ్యూబ్ అన్సారీ తెలిపారు. బుధవారం ధారూరు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయన పర్యటించి మాట్లాడారు. వికారాబాద్‌లోని గొలికార్ ఫంక్షన్‌హాలులో సోమవారం నిర్వహించే మైనార్టీ సమావేశానికి మండలంలోని ముస్లింలందరూ హాజరుకావాలని కోరారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సభకు హాజరుకానున్నారని తెలిపారు. మైనార్టీ నాయకులు.. బాబాఖాన్, గఫార్, సర్ఫరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వృద్ధురాలి మృతి

తాండూరు రూరల్: బాత్‌రూంలో కాలుజారి కిందపడి చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన కరన్‌కోట్ పీఎస్ పరిధిలో బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం... తాండూరు మండలం సిరిగిరిపేట్‌కి చెందిన అమృతమ్మ (60) గతనెల 19న కల్లుతాగిన మైకంలో ఇంట్లో బాత్‌రూంలో కిందపడిపోయింది. ఆమెను వెంటనే కుటుంబ సభ్యులు తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం అమృతమ్మ మృతి చెందింది. తన భార్య మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని ప్రమాదవశాత్తు కింద పడటంతో మృతిచెందినట్లు భర్త రాములు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

108లో ప్రసవం

తల్లీబిడ్డ క్షేమం

ధారూరు: గర్భిణిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే డెలివరీ అయిన సంఘటన ధారూరు మండలం రుద్రారంలో చోటుచేసుకుంది. రుద్రారం గ్రామానికి చెందిన సంగీత నిండుగర్భిణి. ఆమెకు బుధవారం రాత్రి పురిటి నొప్పులు ప్రారంభం కావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో తాండూర్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో మార్గమధ్యలోనే వాహనాన్ని నిలిపిన 108 సిబ్బంది డెలివరీ చేశారు. కాగా సంగీత మగబిడ్డకు జన్మనిచ్చింది.ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

ఒకరికి తీవ్ర గాయాలు

తాండూరు రూరల్: బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన కరన్‌కోట్ సమీపంలో చోటు చేకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం కల్‌బుర్గి జిల్లా వెంకటాపూర్ గ్రామానికి చెందిన వెంకట్‌రాములు వికారాబాద్ జిల్లా తాండూరు మండలం ఓగిపూర్ శివారులోని ఓ నాపరాతి గనిలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవరం గనిలో పనులు ముగించుకోని బైక్‌పై స్వగ్రామం వెంకటాపూర్‌కు వెళ్తున్న క్రమంలో కరన్‌కోట్ సమీపంలోని సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద ఓ లారీ అతడి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకట్‌రాములుకు తీవ్రగాయాలవ్వడంతో వెంటనే హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికితరలించారు. లారీ డ్రైవర్ లక్ష్మయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదుపుతప్పిన బైక్..

ఒకరి దుర్మరణం

పరిగి: బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలై దుర్మరణం చెందిన సంఘటన పరిగి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు.. పరిగి మండలం ఇబ్రహీంపూర్‌కు చెందిన చాకలి దశరథ్(49) బుధవారం పనినిమిత్తం గ్రామం నుంచి పరిగికి బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో చింతల్‌చెరువు సమీపంలో అదుపుతప్పి కిందపడిపోయాడు. ప్రమాదంలో దశరథ్‌కు తీవ్ర గాయాలవ్వగా స్థానికులు అతడిని సమీపంలోని ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు.భార్య మణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'శత'కొట్టారు

- పది ఫలితాల్లో సత్తాచాటిన కొడంగల్ బీసీ గురుకుల విద్యార్థులు
- వందశాతం ఉత్తీర్ణతతో ఆదర్శంగా నిలిచిన పాఠశాల
- స్టడీ అవర్స్, ప్రత్యేక తరగతులు, సమష్టి కృషితోనే సాధ్యమైందంటున్న ఉపాధ్యాయులు



ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

కొడంగల్ రూరల్: కొడంగల్ పట్టణ శివారులోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ఈ ఏడాది పదోతరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్‌బాబు, ఉపాధ్యాయ సిబ్బంది సమష్టి కృషితో ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు సాయంత్రం పూట స్టడీ అవర్స్ తరగతులతో ఉత్తమ ఫలితాలు సాధించగలిగారు. ఉపాధ్యాయులు.. విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రతీనెలా సమావేశాలు నిర్వహిస్తూ విద్యార్థులు వెనుకబడిన సబ్జెక్టుల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ క్రమంలో 67మంది విద్యార్థుకు గాను 67మంది ఉత్తమ మార్కులతో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. సుగేందర్(10 జీపీఏ), వినయ్ (9.8), 9.7 జీపీఏతో.. ఆరుగురు విద్యార్థులు రాఘవేంద్ర, ఎస్.మనోజ్‌కుమార్, ఆర్.మనీష్‌కుమార్, ఎన్.రమేష్, జె.శ్రీహరి, వి.గురుమూర్తి, 9.5 జీపీఏతో.. ముగ్గురు విద్యార్థులు, 9.2 జీపీఏతో.. ఆరుగురు విద్యార్థులు, 9 జీపీఏతో.. ఐదుమంది విద్యార్థులు ప్రతిభ చాటారు. మొత్తం 67 మంది విద్యార్థుల్లో 9–10 జీపీఏ వరకు 25మంది, 8–9 జీపీఏతో 31మంది, 7–8 జీపీఏతో 10 మంది, 6.5 జీపీఏతో ఒక విద్యార్థి.. మొత్తం 67మంది వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. స్టడీ అవర్స్, విద్యార్థుల పట్ల ఉపాధ్యాయుల శ్రద్ధతోనే వందశాతం ఉత్తీర్ణత సాధ్యమైంది. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

స్టడీ అవర్స్ ఉపయోగపడ్డాయి



10 జీపీఏ సాధించినందుకు సంతోషంగా ఉంది. పరీక్షలకు ముందు నిర్వహించిన స్టడీ అవర్స్ ఎంతగానో ఉపయోగపడ్డాయి. స్టడీ హవర్స్‌లో సందేహాలను నివృత్తి చేసుకున్నాం. ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది.

– సుగేందర్, బీసీ గురుకుల, కొడంగల్

ఆటలతో పాటు చదువు



ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో గ్రేడ్ సాధించేందుకు వీలయ్యింది. దీనికితోడు ప్రత్యేక తరగతులతో పాటు క్రీడలు నిర్వహిస్తూ ప్రోత్సాహం అందించారు. పాఠశాలలో నిర్వహించిన సామర్థ్య పరీక్షలతో 9.7 సాధించగలిగాను.

– కె.రాఘవేందర్, బీసీ గురుకుల, కొడంగల్

విద్యార్థులు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు



ఉపాధ్యాయుల సమష్టి కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల పట్టుదలతో ఉత్తమ ఫలితాలు సాధించగలిగాం. ప్రత్యేక తరగతులు, వెనుకబడిన విద్యార్థులకు అవగాహన కల్పించడంతో వందశాతం ఉత్తీర్ణత సాధ్యమైంది. ప్రతి విద్యార్థితోపాటు ఉపాధ్యాయ సిబ్బందికి శుభాకాంక్షలు.

– శంకర్‌బాబు, ప్రిన్స్‌పాల్, బీసీ గురుకుల, కొడంగల్



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, నాయకులు

లక్షమందితో బహిరంగ సభ

- ఈనెల 6న తాండూరుకు రానున్న ప్రియాంక గాంధీ
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు టౌన్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 6వ తేదీన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ తాండూరుకు రానున్నట్లు స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన పట్టణంలోని విలియంమూన్ మైదానం, హెలిప్యాడ్‌ను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా పట్టణంలోని విలియంమూన్ మైదానంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ప్రియాంకా గాంధీతో పాటు కాంగ్రెస్ పార్టీ కేంద్ర, రాష్ట్ర అగ్రనేతలు హాజరవుతున్నారన్నారు. సుమారు లక్షమంది కాంగ్రెస్ కార్యకర్తలతో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రంజిత్‌రెడ్డిని 2లక్షల మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. తాండూరు సెగ్మెంటు ఇన్‌చార్జి మహేష్, నాయకులు ధారాసింగ్, మురళీకృష్ణ, మధులత, ప్రభాకర్ గౌడ్, బాల్‌రెడ్డి, నర్సింహులు తదితరులు ఉన్నారు.

అన్నారంలో పులి సంచారం

నిఘా ఏర్పాటు చేసిన ఫారెస్టు అధికారులు

కొడంగల్: మండల పరిధిలోని అన్నారంలో పులి సంచరిస్తోందనే వార్త కలకలం రేపింది. ఈ విషయమై గ్రామస్తులు బుధవారం అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫారెస్టు అధికారులు హుటాహుటిన గ్రామ శివారులోని ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో, చుట్టుపక్కల ఆనవాళ్లను పరిశీలించగా పులి సంచరించినట్లు నిర్ధారించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పొలాలకు వెళ్లేటప్పుడు మూకుమ్మడిగా వెళ్లాలన్నారు. నిఘా ఏర్పాటు చేసి త్వరలో పులిని పట్టుకుంటామని ఫారెస్టు అధికారులు తెలిపారు.



పులి సంచరించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

మృతదేహం ఆచూకీ లభ్యం

- చంద్రవంచకు చెందిన అనితదిగా గుర్తింపు
- భర్తే హత్యచేసి ఉంటాడని మృతురాలి తండ్రి ఫిర్యాదు

తాండూరు రూరల్: మండల పరిధిలోని చంద్రవంచ గ్రామ శివారులోని వాగులో లభ్యమైన మహిళ మృతదేహం ఆచూకీ లభ్యమైంది. మృతురాలు చంద్రవంచ గ్రామానికి చెందిన అనితగా పోలీసులు గుర్తించారు. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం... కర్ణాటక రాష్ట్రం జట్బురు గ్రామానికి చెందిన అనితను తాండూరు మండలం చంద్రవంచకి చెందిన బోయిని లక్ష్మప్పతో 14 సంవత్సరాల కిత్రం వివాహం అయ్యింది. ఇటీవల భర్త లక్ష్మప్ప తాగుడుకు బానిసై అనితను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా అనిత జాడ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం చంద్రవంచ గ్రామ శివారులోని కాగ్నా నదిలో ఓ మహిళ మృతదేహం లభించింది. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ జరపగా మృతదేహం చంద్రవంచ గ్రామానికి చెందిన అనితదిగా గుర్తించారు. అనితను భర్త లక్ష్మప్ప కిరాతంగా హత్యచేసి వాగులో పడేసి ఉంటాడని మృతురాలి తండ్రి తుల్జప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

అక్రమార్జనకే పార్టీల మార్పు

- బీఆర్ఎస్ నాయకులను బెదిరించి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఫైర్
- మొయినాబాద్‌లో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవం

మొయినాబాద్: అక్రమ సంపాదనకు పాల్పడేవారు మాత్రమే పార్టీలు మారుతారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులను భయపెట్టి, ప్రలోభాలకు గురిచేసి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారన్నారు. పదేళ్ల పాటు తనతో ఉండి పనులు చేయించుకున్న నాయకులు ఇప్పుడు పార్టీని, నన్ను మోసం చేసి ఇతర పార్టీల్లోకి వెళ్తున్నారన్నారు. అలాంటి నాయకులు పార్టీ వీడినా కార్యకర్తలు భయపడవద్దని.. మీరే నాయకులుగా ఎదగాలన్నారు. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని.. అందుకోసం కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ప్రజల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత మొదలైందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించి పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఇన్‌చార్జి రాంబాబు, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొంపల్లి అనంతరెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహగౌడ్, మైనార్టీ నేత షేక్ మహబూబ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు రవూఫ్, రాజు, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీహరి, కుమార్, సిద్దయ్య, సీనియర్ నాయకులు ఆంజనేయులు, కృష్ణారెడ్డి, గణేశ్‌రెడ్డి నాయకులు ప్రవీణ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, పరమేశ్, కృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

షేడ్‌నెట్లు ఏర్పాటు చేసుకోవాలి

డీఆర్‌డీఓ శ్రీనివాస్

బంట్వారం: ఎండల తీవ్రత నేపథ్యంలో నర్సరీల్లో మొక్కలు ఎండకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఓ శ్రీనివాస్ ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన మండల పరిధిలోని సల్బత్తాపూర్, మద్వాపూర్ నర్సరీలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. మొక్కలు ఎండకుండా ప్రతీ నర్సరీలో షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. మొక్కలకు అవసరమైన మేరకు నీరు పట్టాలన్నారు. హరితహారం నాటికి నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచాలన్నారు. అనంతరం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. జాబ్‌కార్డ్ కలిగిన కూలీలందరికీ వంద రోజుల పని కల్పించాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు వడదెబ్బ తగులకుండా జాగ్రత్తలు తీసుకోవాలని..మంచి నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, ఎంపీఓ విజయ్‌కుమార్, ఈజీఎస్ ఏపీఓ సుధాకర్, ఈసీ శ్రీనివాస్, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



సల్బత్తాపూర్ నర్సరీలో రిజిస్టర్ చెక్ చేస్తున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్

బాల్యవివాహాలపై సమాచారం ఇవ్వండి

జిల్లా సంక్షేమ శాఖ అధికారి జ్యోతి పద్మ

అనంతగిరి: బాల్య వివాహాలు జరిపినా, ప్రోత్సహించినా అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ శాఖ అధికారి జ్యోతి పద్మ అన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్‌లైన్ సంయుక్తంగా బాల్య వివాహాలపై తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం పట్టణంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి పద్మ మాట్లాడుతూ.. ఈ నెలలో వచ్చే అక్షయ తృతీయ సందర్భంగా ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లుగా సమాచారం ఉంటే ముందస్తుగా అంగన్‌వాడీ టీచర్లు, ప్రజాప్రతినిధులు, పూజారులు, ఖాజీలు, పాస్టర్లు, పెళ్లి జరిగే ఫంక్షన్‌హాళ్ల యజమానులు జిల్లాలోని డీసీపీయూ అధికారులకు లేదా చైల్డ్‌లైన్ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. ఇప్పటికే ఐసీడీఎస్, మిషన్ వాసల్య సిబ్బంది బాల్య వివాహాల నిర్మూలన కోసం క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. బాల్యవివాహాలు చేపట్టినా, సహకరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమీక్షా సమావేశానికి జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు శ్రీకాంత్, ఆంజనేయులు, చైల్డ్‌లైన్ ప్రతినిధి రాజునాయక్, హబ్బు కోఆర్డినేటర్ బలరాం నాయక్, సఖి ప్రతినిధి యశోధ, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

పోల్-చీటీల పంపిణీ షురూ



దౌల్తాబాద్‌లో పోల్‌చిటీ పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓ

దౌల్తాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా పోల్ చీటీల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్‌ఓ(బూత్ లెవల్ ఆఫీసర్)లు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు పోల్ చీటీలు అందజేస్తున్నారు. ఈ ప్రక్రియ ఇప్పటికే దౌల్తాబాద్ మండలంలో ప్రారంభమైంది. ఓటర్ల సమాచారంతో పాటు తమ పరిధిలో ఏదైనా ఎన్నికల ఉల్లంఘనలు జరిగినా రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకొచ్చేలా పోలీచిటీలపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారి వెబ్‌సైట్, 1950 టోల్‌ఫ్రీ నంబర్ కూడా ముద్రించి ఉంది. కాగా వీటిని గతంలో రాజకీయ పార్టీలే ముద్రించి పోలింగ్‌కు ముందురోజు తమ గుర్తులున్న కరపత్రాలతో ఓటర్లకు పంచేవి. అవి పూర్తిస్థాయిలో ఓటర్లకు చేరక ఇబ్బందులు ఏర్పడేవి. దీంతో ఈ సారి ఓటర్లు సులువుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు వినియోగించుకునేలా ఎన్నికల సంఘమే వీటిని ముద్రించి పంపిణీ చేస్తోంది.

బీజేపీకి అన్నివర్గాల మద్దతు



ప్రచారంలో పాల్గొన్న మాధవరెడ్డి, నాయకులు

పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం వికారాబాద్‌లోని ఇంద్రానగర్, రామయ్యగూడలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో మాధవరెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఏగ్రామానికి వెళ్లినా అన్నివర్గాలు కొండాకు మద్దతు పలుకుతున్నాయన్నారు. దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సుచరితారెడ్డి, బీజేపీ నాయకులు రాజేందర్‌రెడ్డి, శ్రీకాంత్, సతీష్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు

ప్రేమ పేరిట బాలికను మోసం చేసిన యువకుడికి రూ.40 వేల జరిమానా

చేవెళ్ల: బాలికను ప్రేమ పేరిట నమ్మించి అత్యాచారం చేసి మోసం చేసిన వ్యక్తికి ఎల్‌బీనగర్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు స్పెషల్ జడ్జి హరీష 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.40 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు చేవెళ్ల ఏసీపీ బి.కిషన్ తెలిపారు. బుధవారం ఆయన ఏసీపీ కార్యాలయంలో సీఐ లక్ష్మారెడ్డి, ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్‌తో కలిసి మాట్లాడుతూ.. 2017లో సంగారెడ్డి జిల్లా కలహేర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన గావిని రత్నయ్య అలియాస్ రత్నం(కిరణ్) ఫోన్‌లో ఓ బాలికతో పరిచయం పెంచుకుని ప్రేమిస్తున్నానని నమ్మించాడు. వారిద్దరూ చేవెళ్లలోనే తరచూ కలుసుకునేవారు.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి యాదగిరిగుట్టకు తీసుకెళ్లి అక్కడే ఓ గదిని అద్దెకు తీసుకుని అక్కడే లోబర్చుకున్నాడు. బాలిక గర్భం దాల్చి వివాహానికి ఒత్తిడి తెచ్చింది. దీంతో తనకు ఎలాంటి సంబంధం లేదంటూ బుకాయించాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు చేవెళ్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ గురువయ్యగౌడ్ పోక్సో చట్టం కింద కేసు దర్యాప్తు చేపట్టారు. ఎల్‌బీనగర్ ఫాస్ట్ ట్రాక్ కోర్టులో పీపీ కోమలత ఈ కేసు వాదోపవాదాలు వినిపించింది. ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు జడ్జి హరీష రత్నయ్యకు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.40వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిషన్

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

ఆర్డీఓ వాసుచంద్ర

పరిగి: లోక్‌సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఏఆర్‌ఓ, ఆర్డీఓ వాసుచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని నంబర్ వన్ స్కూల్‌లో పీఓఎస్, ఏపీఓఎస్‌లకు ఎన్నికల నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ స్టేషన్లలో ఇప్పటికే అన్ని సదుపాయాలను కల్పించామన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. తహసీల్దార్ ఆనంద్‌రావు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపిన ప్రకారం.. గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి(55) మృతి చెందాడు. మృతుడి వివరాలకు యత్నించినా లభించలేదు. మృతుడి శరీరంపై తెలుపు బనియన్, నలుపు డ్రాయర్, కుడి చేతికి నల్లని దారం ధరించాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులకు 9848090426 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. షాద్‌నగర్ స్టేషన్ మాస్టర్ ఠాకూర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు.

వడదెబ్బతో గుర్తుతెలియని వృద్ధుడి మృతి

కందుకూరు: వడదెబ్బతో గుర్తుతెలియని ఓ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మక్బూల్‌జానీ తెలిపిన ప్రకారం.. కందుకూరు చౌరస్తాలో ఏప్రిల్ 29న మధ్యాహ్నం గుర్తుతెలియని ఓ వృద్ధుడు అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన పోలీసులు 108 అంబులెన్స్ వాహనంలో చికిత్స నిమిత్తం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన బుధవారం ఉదయం మరణించాడు. అతని వయస్సు 60–65 సంవత్సరాలు ఉంటుంది. వివరాలు తెలియరాలేదని సంబంధీకులు ఎవరైనా ఉంటే సెల్ నంబర్ 8712662396కు సమాచారం అందించాలని సీఐ మక్బూల్‌జానీ కోరారు.

అమ్మా మళ్లీ వస్తానని.. అనంత లోకాలకు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

షాద్‌నగర్‌రూరల్: ఏడాది క్రితమే భర్తను పోగుట్టుకున్న ఆమె బాధను దిగమింగుతూ కొడుకుపై ఆశలు పెంచుకుంది. కానీ విధి ఆ తల్లి ఆశలను అడియాశలు చేసింది. రోడ్డు ప్రమాదం రూపంలో ఆమె కుమారుడిని పొట్టనబెట్టుకుంది. ఈ హృదయవిదారక ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్టలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ శరత్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరధిలోని మొగిలిగిద్దకు చెందిన విజయలక్ష్మి చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సెకండ్ ఏఎన్ఎంగా పనిచేస్తోంది. ఆమె కుమారుడు సందీప్(25) ఎలికట్ట సమీపంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. మంగళవారం తన మిత్రుడు ఫోన్ చేసాడని.. మళ్లీ వస్తానని చెప్పి బైక్‌పై షాద్‌నగర్ వైపు వెళ్తున్నాడు. ఎలికట్ట సమీపంలో రోడ్డుపై నిలిపిన లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సందీప్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.